ప్రశాతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు

అనంతపురం కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం పేపర్-1 జనరల్ స్టడీస్ పరీక్షలకు 9926 మంది దరఖాస్తు చేసుకోగా 7406 మంది 74.6 శాతం హాజరు అయ్యారు. 2520 మంది గైర్హాజరు అయ్యారు. మధ్యాహ్నం పేపర్-2 రీజనింగ్, అర్థమెటిక్, కరెంట్ అఫైర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ సబ్జెక్ట్ పరీక్షలకు 9926 మంది దరఖాస్తు చేసుకోగా 7375 మంది హాజరయ్యారు. 74.29 శాతం మంది హాజరయాయరు. 2551 మంది గైర్హాజరు అయ్యారు. పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును సమీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. జిల్లా ఎస్పీతో పాటు అనంతపురం ఇన్‌ఛార్జి డీఎస్పీ మహబూబ్‌బాషా, త్రీటౌన్ సిఐ కత్తి శ్రీనివాసులు ఉన్నారు. ఎస్ఎస్‌బిఎన్ పరీక్ష కేంద్రంలో పరీక్షా సమయానికి రాని అభ్యర్థులు ఇద్దరిని అనుమతించకపోవడంతో వారు వెనుతిరిగారు.

నిబంధనలు మరిచారు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఉక్కడా లేని విధంగా దాదాపు 9 ఎకరాల్లో హిందూపురం పట్టణ నడిబొడ్డున పురపాలక సంఘం వారు రూ.30 కోట్లు వెచ్చించి నూతన వాణిజ్య సముదాయం నిర్మాణం చేపట్టారు. వీటికి వేలం పాటలు వేసి ఏడాది గడిచింది. దీనిని రెండో సారి ప్రారంభించి కూడా ఏడు నెలలు పూర్తి అయింది. వాణిజ్య సముదాయ భవనంలో వేలం పాటలో గదులు తీసుకున్న వారు అందులో వ్యాపారాలు ప్రారంభించలేదు. మున్సిపల్ అధికారులు వ్యాపారులకు చెప్పిన విధంగా సౌకర్యాలు కల్పించక పోవడంతోనే వ్యాపారులు సుముఖత చూపడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కూరగాయాల మార్కెట్ భవనాలు శిథిలావస్థకు చేరడంతో టిడిపి ప్రభుత్వం హయాంలో దానిని కూల్చివేశారు. అదే స్థానంలో రూ.100 కోట్లతో నూతనంగా అన్ని సౌకర్యాలతో కూరగాయాల మార్కెట్‌తో పాటు వాణిజ్య సముదాయం, చికెన్, మటన్, చేపలు, పూలు, పండ్లు ఇలా ప్రతి ఒక్కటి అక్కడే ప్రజలకు అందే విధంగా నిర్మాణం చేస్తామని చెప్పారు.

మార్కెట్‌లో అడుగుపెట్టని వ్యాపారులు
వృథాగా వాణిజ్య సముదాయ భవనాలు

అప్పటికే అక్కడ వ్యాపారాలు చేస్తున్న వారికి ప్రాధాన్యత ఇచ్చి గుడ్‌విల్ లేకుండా గదులు కేటాస్తామని చెప్పారు. అయితే రూ.100 కోట్లు కాదు కదా కనీసం రూ.50 కోట్లతో కూడా మార్కెట్ నిర్మాణం చేపట్ట లేకపోయారు. చివరకు ఎన్నికలు సమీపించడంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు, పురపాలక సంఘం రూ.3 కోట్లు, గుడ్ విల్ రూపంలో రూ.10 కోట్లు మొత్తం రూ.23 కోట్లతో మార్కెట్ నిర్మాణం ప్రారంభించారు. అది ఇంకా పూర్తికాక ముందే అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే బాలకృ చేతుల మీదుగా దానిని ప్రారంభించారు. ప్రారంభించి రెండు సంవత్సరాలు గడిచిన అనంతరం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాలకవర్గ సహకారం, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ సూచన మేరకు మార్కెట్ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించి నిర్మాణం పూర్తిచేశారు. దీంతో పాటు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. దీంతో పాటు కూరగాయాల వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసి దానిని సైతం ప్రారంభించారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూల వ్యాపారాలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూవచ్చారు. అయితే వాణిజ్య సముదాయంలో అవసరమైన సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించలేదని ఆరోపిస్తూ అక్కడ ఎవరూ వ్యాపారాలు ప్రారంభించలేదు.

నిబంధనలు మరచిన అధికారులు

నూతన మార్కెట్, వాణిజ్య సముదాయం ప్రారంభ సమయంలో మున్సిపల్ అధికారులు వ్యాపారులకు మార్కెట్ చుట్టూ రెండు కిలోమీటర్ల వరకు తోపుడుబండ్ల వ్యాపారాలు లేనివిధంగా చూస్తామని చెప్పారు. అయితే ఈ నిబంధనలు అమలు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వ్యాపారులు పేర్కొంటున్నారు. మార్కెట్ ముందు తోపుడు బండ్ల వ్యాపారులు వ్యాపారాలు చేస్తుండడంతో మార్కెట్ లోపలికి ఎవరూరావడం లేదని చెబుతున్నారు. ఇప్పటికే వడ్డీలకు అప్పు తీసుకొచ్చి పురపాలక సంఘానికి గుడ్‌విల్ చెల్లించామన్నారు. ఇంకా పెట్టుబడి పెట్టి వ్యాపారాలు ప్రారంభిస్తే నష్టాలు వస్తే తెచ్చిన అప్పులకు వడ్డీ సైతం చెల్లించడం కష్టంగా మారుతుందని వ్యాపారాలు ముందుకు రావాడంలేదు. మార్కెట్ ముందున్న తోపుడు బండ్లను ఖాళీ చేయించి, వేలం పాట సమయంలో చెప్పిన నిబంధనలు పాటిస్తే అన్ని వ్యాపారాలూ ఒకే చోట ప్రారంభిస్తామని వ్యాపారులు పేర్కొంటున్నారు. అయితే తమను ఇక్కడి నుంచి పంపిస్తే తామెలా బతకాలని తోపుడుబండ్ల వ్యాపారులు వాపోతున్నారు.

మార్కెట్ భవన సముదాయం ఎదుట తోపుడు బండ్లతో వ్యాపారాలు చేస్తున్న దృశ్యం

సౌకర్యాలు కల్పిస్తే నెలకు రూ.18 లక్షలు ఆదాయం

పురపాలక సంఘ అధికారులు, పాలకవర్గం నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయంలో వ్యాపారులకు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తే మున్సిపాల్టీకి నెలకు సుమారు రూ.18 లక్షలు ఆదాయం వస్తుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. దీంతో పాటు మార్కెట్ కింద పూల వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలంటున్నారు. మార్కెట్ ముందు ఉన్న పురపాలక స్థలంలో గదులు నిర్మాణం చేసి కూరగాయల హోల్‌సేల్ వ్యాపారులకు కేటాయిస్తే మరో రూ.2 లక్షలు ఆదాయం వస్తుందని చెబుతున్నారు. తోపుడుబండ్ల వారు వ్యాపారం చేసుకునేందుకు మార్గం చూపించి మున్సిపల్ పాలకవర్గం, అధికారులు ఆ దిశగా అడుగులు వేయాలని పలువురు కోరుతున్నారు.

మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

జగన్న ఇళ్ల స్థలాల కోసం సిపిఎం పోరాటం

10 నుంచి 12వ తేదీ వరకు ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు
సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న ఇళ్లు పూర్తి చేయడానికి ఇంటికి రూ.5 లక్షలు కేటాయించాలని, ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. ఆదివారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్యలతో కలిసి ఆయన మాట్లాడారు. జగనన్న ఇళ్లు జిల్లాకు 68,288 కేటాయించి కేవలం 6,045 మాత్రమే పూర్తి చేయడం పేదలను వంచించడమేనని విమర్శించారు. సంక్రాంతి నాటికి 15 వేల ఇళ్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించినట్లు వార్తలు వచ్చాయని తెలిపారు. ఈ పద్ధతుల్లో ఇళ్ల నిర్మాణం జరిగితే వచ్చే ఐదేళ్లకు కూడా మంజూరైన ఇళ్లు పూర్తికావన్నారు. పునాది దశలో ఆగిపోయినవి 26 వేల ఇళ్లు ఉన్నాయని తెలిపారు. అర్జీ పెట్టుకున్న 90 రోజుల్లో ఇళ్ల స్థలాలు, ఇంటి పట్టాలు ఇస్తామన్న ప్రభుత్వ హామీ అమలు కావడం లేదన్నారు. ఇంటి స్థలాల కోసం అర్జీలు పెట్టుకున్న వారిలో 10 వేల మందిని అర్హులుగా గుర్తించినా ఒక్కరికీ స్థలం చూపలేదన్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జాదారులు దౌర్జన్యంగా ఆక్రమించుకుని కోట్ల రూపాయలు వ్యాపారాలు చేసుకుంటున్నా అరికట్టడం లేదన్నారు. కంచే చేను మేసినట్లు కొందరు ప్రజా ప్రతినిధులు కొండలు, గుట్టలు, ప్రభుత్వ భూములు వందల ఎకరాల్లో ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. వీరికి కొందరు రెవెన్యూ అధికారులు తోడుకావడంతో పేదల ఇళ్లకు స్థలాలు దొరకడం లేదన్నారు. భూమి ధరలు, ఆకాశానంటుతున్న ఈ పరిస్థితుల్లో మధ్యతరగతి వారు కూడా ఇళ్ల స్థలాలు కొనలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అందుకే పేదలకు ఇంటి స్థలం కావాలంటే ఉద్యమాలు తప్ప వేరే మార్గం లేదన్నారు. ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి ఈ నెల 10, 11, 12 తేదిల్లో ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాగు భూముల కోసం 13న సదస్సు

కూడేరు, గార్లదిన్నె, పుట్లూరు, శింగనమల మండలాల్లో ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేదల సమస్యలపై ఈ నెల 13న అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ తెలిపారు. త్వరలో జరగున్న అసైన్డ్ కమిటీ సమావేశాల్లో పేదల భూములను పెత్తందార్లు తమ పేర్లతో రాయించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. పలు మండలాల్లో కొండలు, గుట్టలు, దళిత శ్మశాన స్థలాలు, ప్రభుత్వ భూములు కబ్జా కావడం పెరిగిపోయిందన్నారు. పేదలు సాగు చేసుకుంటున్న భూములకు సాగు పట్టాలు ఇవ్వాలని నిర్వహిస్తున్న సదస్సును, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణలో జాగ్రత్తలు అవసరం

సత్యసాయి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శంకర ప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు కంగారు పడకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని శ్రీ సత్యసాయి జిల్లా అగ్నిమాపక శాఖ విపత్తుల స్పందన అధికారి శంకర ప్రసాద్ పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదం వల్లే జరుగుతుంటాయని తెలిపారు. ఆస్తి నష్టంతోపాటు ప్రాణ నష్టం కూడా సంభవిస్తుందన్నారు. వర్షాకాలంలో నదులు, చెరువులు, జలాశయాలు, వంకల, వాగులు ఉప్పొంగుతున్న సందర్భంలో నీటి ప్రవాహంలో చిక్కుకొని సహాయం కోసం ఎదురు చూసే బాధితులు ఉంటారన్నారు. పెద్ద పరిశ్రమల్లో ప్రమాదంలో చిక్కుకుని అలమటిస్తూ దిక్కుతోచని స్థితిలో ఉంటారన్నారు. మరికొందరు అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి ఆ మంటల్లో చిక్కుకొని బయటకు వచ్చే మార్గం లేక తల్లడిల్లి పోతుంటారన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఉన్న వారి సమాచారం తెలిసిన వెంటనే అగ్నిమాపక దళం సైరన్ మోగించుకుంటూ అక్కడికి చేరుకుంటుందన్నారు. సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రమాదంలో చిక్కుకున్న బాధితులను ఎంతో సాహసం చేసి కాపాడుతుంటారని చెప్పారు. సమాజానికి ఈ శాఖ అవసరం ఎంతో ఉంటుందన్నారు. కీలకమైన అగ్నిమాపకశాఖ

పనితీరు.. వారు స్పందించే విధానంపై ఆ శాఖ జిల్లా అధికారి శంకర్ ప్రసాద్ ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూ వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రశ్న : సత్యసాయి జిల్లాలో ఎన్ని అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి? ఎక్కడెక్కడ ఉన్నాయి.?

జవాబు : జిల్లా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, మడకశిర కేంద్రాలలో ఉన్నాయి. ప్రతి కేంద్రంలో ఒక అగ్నిమాపక వాహనం ఉంటుంది. సిబ్బంది 24 గంటలు విధుల్లో ఉంటారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రమాద స్థలానికి చేరుకొని తగు చర్యలు చేపడతారు.

ప్రశ్న : ఇరుకైన ప్రదేశాలు, ప్రాంతాలు ఉన్నచోటికి వాహనాలు వెళ్లలేని పరిస్థితిలో ఏం చర్యలు తీసుకుంటారు ?

జవాబు : కొన్ని పట్టణాల్లో ఇరుకైన వీధుల్లోకి అగ్నిమాపక వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. అలాంటి ప్రదేశాల్లో మిస్ట్ అని వాహనం ద్వారా సిబ్బంది చేరుకుంటారు. ప్రమాదమని తెలిసినా సురక్షితులైన సిబ్బంది అక్కడికి చేరుకుని నివారణ చర్యలు చేపడతారు.

ప్రశ్న : జరుగుతున్న ప్రమాదాలపై మీ విశ్లేషణ ఏమిటి.?

జవాబు : గతంతో పోల్చుకుంటే అగ్ని ప్రమాదాలు తగ్గాయి. దానికి కారణం పూరిళ్ల స్థానంలో పక్కా గృహ నిర్మాణాలు జరగడం. గడ్డివాములు తగ్గిపోవడం, ప్రజల్లో అవగాహన పెరగడం పట్ల ప్రమాదాలు తగ్గాయి. అయితే ఇప్పుడు ఎక్కువగా గ్యాస్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వర్షాలు తక్కువగా కురుస్తున్న కారణంగా నదులు పొంగి పొర్లటం లాంటి సంఘటనలు ఇతర ప్రదేశాలతో పోల్చుకుంటే ఈ ప్రాంతాలో తక్కువే. ఈ ప్రాంతాల్లో ఎక్కువగా వేరుశనగ పంట పెడుతున్న కారణంగా బహిరంగ ప్రదేశాల్లో వాములు వేయటం వల్ల కొందరు వ్యక్తులు సిగరెట్లు, బీడీలు తాగి ఆర్పకుండా పారవేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మానవ తప్పిదంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతుంటాయి.

ప్రశ్న : ప్రమాదాల నివారణకు మీరు తీసుకుంటున్న చర్యలు ?

జవాబు : తరచూ పట్టణాల్లో, గ్రామాల్లో

ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఎక్కువగా గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ప్రదర్శనలు ఇస్తుంటాం. గ్యాస్ వల్ల వచ్చే మంటలు ఏ విధంగా ఆర్పవచ్చు, ఎలా నివారించవచ్చని తమ సిబ్బంది వివరిస్తూ ఉంటారు.

ప్రశ్న : ప్రజలకు మీరిచ్చే సూచనలు సలహాలు ఏమిటి ? సిబ్బంది కొరత ఉందా ?

జవాబు : ప్రమాదాలు జరిగినప్పుడు ఆయా అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇస్తే తమ సిబ్బంది వెంటనే స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటారు. సిగరెట్లు, బీడీ తాగేవారు ఆర్పివేస్తే ప్రమాదాలు జరగవు. ప్రజలు అగ్ని ప్రమాదం పట్ల జాగ్రత్తలు పాటించడంతోపాటు బాధ్యతగా ప్రవర్తించాలి. సిబ్బంది కొరత గాని, యంత్ర పరికరాల సమస్య గాని లేదు.

ఉపాధ్యాయుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు ప్రకాష్‌రావు

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిరాజుద్దీన్, లింగమూర్తి

ప్రజాశక్తి-అనంతపురం

ఉపాధ్యాయుల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందని, వాటిని కాపాడుకొనేందుకు మనమంతా ఐక్యంగా పోరాడుదామని ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు ప్రకాష్‌రావు పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం నగరంలోని ఉపాధ్యాయ భవన్ నందు ఫ్యాప్టో సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు ప్రకాష్‌రావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల హక్కులను కాలరాస్తోందన్నారు. అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదన్నారు. ఉపాధ్యాయ బదిలీల జీవోలలో అనేక నిబంధనలు అసంబద్ధంగా ఉన్నాయన్నారు. అందువల్లనే ఎక్కువ మంది ఉపాధ్యాయులు కోర్టులను ఆశ్రయించారన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి డిఎ ఇవ్వలేదని, వేతనాలు కూడా ఒకటవ తేదీకి ఇవ్వడం లేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఫ్యాప్టో ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని తెలియజేశారు

ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా ఎస్.సిరాజుద్దీన్ (ఎపిటిఎఫ్-257) సెక్రటరీ జనరల్‌గా జి లింగమూర్తి (ఎస్ఎపి) కో ఛైర్మన్లుగా బి.పురుషోత్తం (డిటిఎఫ్), జావిద్‌అహ్మద్ (ఆర్‌యుటిఎ), పెద్దన్న (ఎస్‌టి, ఎస్‌సి, యుఎస్), చిరంజీవులు (బిటిఎ) డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా వై.గోవిందరాజులు (యుటిఎఫ్), ఎన్.రమణారెడ్డి(ఎస్‌టియు), శ్రీనివాస్‌రెడ్డి (ఎపిటిఎఫ్ 38), కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ (హెచ్ఎంఎ), కోశాధికారిగా సి.గోపాల్‌రెడ్డి (ఎపిపిటిఎ) కార్యవర్గ సభ్యులుగా వెంకటేశులు (ఎపిటిఎఫ్-257), జి.సూర్యుడు (ఎస్‌టియు), పి,శివశంకర్ (ఎస్ఎపి), జి.రవీంద్ర (ఎపిటిఎఫ్ 1938), జార్జ్ (డిటిపి), ఎం జైరాంరెడ్డి (హెచ్ఎంఎ), ఎస్.హర్షద్ (ఆర్‌యుటియు), బి.శంకర్ (ఎపిపిటిఎ), వెంకటేశులు (ఎస్‌సి ఎస్‌టియుఎస్), జిఆర్.మహేష్ (బిటిఎ), సి.లింగమయ్య (యుటిఎఫ్) లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి నరసింహులు, వెంకటేశులు, సూర్యనారాయణ గౌడ్, రామసుబ్బారెడ్డి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలుచేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప

ప్రజాశక్తి-ఉరవకొండ

సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప డిమాండు చేశారు. ఆదివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉరవకొండ పట్టణంలోని ఎస్‌కె ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణం నుంచి పాదయాత్ర చేపట్టి 2 కే వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో భాగంగా సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న డిఎ లను వెంటనే విడుదల చేయాలన్నారు. సిపిఎస్ రద్దు చేయాలని పోరాటాలు చేసిన ఉద్యోగులపై పెట్టిన బలవంతపు కేసులు అన్నింటినీ తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఉద్యోగులకు రావాలిస్న బకాయి వేతనాలను వెంటనే విడుదల చేసి ఉద్యోగుల పట్ల నిరంకుశ విధానాన్ని వీడి స్నేహభావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, జిల్లా సహాయ అధ్యక్షులు రామప్ప చౌదరి, కార్యదర్శి సంజీవ్ కుమార్, ఉరవకొండ జోన్ నాయకులు రఘు, రాజశేఖర్, శ్రీధర్, బండయ్య, శేఖర్, శ్రీనివాసగుప్త, జయ రాములు, ఇస్లాం బాషా, మధుభాబు, ఎర్రిస్వామి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

2కె వాక్ నిర్వహిస్తున్న ఫాప్టో నాయకులు

బిజెపి జిల్లా అధ్యక్షుడి కార్యాలయం ఎదుట ధర్నా

నమ్మించి మోసం చేశాడంటూ మహిళా నాయకుల ఆవేదన

ప్రజాశక్తి - కదిరి టౌన్

బిజెపి జిల్లా అధ్యక్షులు వజ్రభాస్కర్‌రెడ్డి కార్యాలయం ముందు అదే పార్టీకి చెందిన కార్యకర్తలు ఆదివారం ధర్నా నిర్వహించారు. తమకు కల్లిబొల్లిమాటలు చెప్పి పార్టీలోకి చేర్పించుకుని మోసం చేశాడని హిందూ, ముస్లిం మహిళా కార్యకర్తలు వాపోయారు. అంతకు ముందు టవర్ క్లాక్ నుంచి వజ్ర భాస్కర్ రెడ్డి రెడ్డి కార్యాలయం వరకు హిందూ, ముస్లిం మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. దాదాపు గంట పాటు భాస్కర్ రెడ్డి కార్యాలయం ముందు ధర్నా చేశారు . భాస్కర్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా నాయకురాలు కృష్ణవేణి, అబీద, భవాని, రేణుక, ఎల్లమ్మ తదితరులు మాట్లాడుతూ వజ్ర భాస్కర్ రెడ్డి తమను నమ్మించి మోసం చేశారని విమర్శించారు. గతంలో వైసిపిలో పనిచేస్తున్న తాము వజ్రభాస్కర్‌రెడ్డి మాటలు నమ్మి మోసపోయామన్నారు. పార్టీలోకి చేరినప్పటి నుంచి కుటుంబాలను వదిలేసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆయన వెన్నంటే నడిచామన్నారు. ప్రస్తుతం రోడ్డుపాలయ్యామని అన్నారు.కదిరి పట్టణంలో ఒక్కొక్క కార్యకర్తకు ఇంటికోసం ఐదు సెంట్లు స్థలం తోపాటు ఇల్లు నిర్మించి ఇస్తానని, 25 లక్షల రూపాయలు డబ్బులు ఇస్తానని, పిల్లల చదువు అయ్యే ఖర్చులు భరిస్తానని హామీ ఇచ్చాడన్నారు. ఆయన మాటలు నమ్మి మూడు సంవత్సరాల క్రితం పార్టీలోకి చేరి అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఐదు రోజుల క్రితం వజ్ర భాస్కర్ రెడ్డి తమకు ఇంటిస్థలాలు చూపి ఇక్కడ పునాదులు వేసుకుని గృహాలు నిర్మించుకోవాలని చెప్పారన్నారు. అయితే ఆ స్థలం ప్రభుత్వ స్థలమని అన్నారు. భాస్కర్ రెడ్డి ఆయన తమ్ముడు సోమశేఖర్ రెడ్డి చెప్పిన మాటలు నమ్మి తాము మోసపోయామన్నారు. గత రంజాన్ మాసంలో కదిరి నియోజకవర్గం లో ముస్లింలకు రంజాన్ తోఫాకు అని 50 లక్షల రూపాయలు చెక్కును ఇస్తున్నట్లు ప్రకటనలు ఇచ్చి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రెండు నెలల క్రితం కుటాగుల మున్సిపాలిటీ పరిధిలో 5 లక్షల రూపాయలు చెక్కును ఇస్తున్నట్లు పత్రికల్లో రాయించుకొని తిరిగి ఆ చెక్కును వెనక్కు తీసుకున్నారని విమర్శించారు. ఇదేమని అడిగితే 'రాజకీయ నాయకులు ఎన్నో చెప్తాం.. అవన్నీ ఇవ్వాలని రూల్ ఉందా' అని చెప్పి తమ పట్ల దురుసుగా వ్యవహరించారని మహిళలు ఆరోపించారు. ఆయన చేసిన మోసాలు, బినామీల వ్యవహారాన్ని బయటపెడతామని అన్నారు. పార్టీ రాష్ట్ర పెద్దలు ఈ విషయంలో చొరవ తీసుకొని తమకు న్యాయం చేయకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమయంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గిరిజమ్మ భర్త అక్కడి వచ్చి ఆందోళనకారుల పట్ల దురుసుగా వ్యవహరించడంతో వారు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భాస్కర్ రెడ్డి బయటికి రావాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆందోళన తీవ్రతరం కావటంతో పట్టణ పోలీసులు జోక్యం చేసుకున్నారు. మహిళా కార్యకర్తలను సర్ది చెప్పేప్రయత్నం చేశారు. అయినా వారు వినకపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఇమ్రాజ, రమీజా, రఘాన్సీ, లక్ష్మీదేవి, బాబా పక్రుద్దీన్, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

ధర్నా చేస్తున్న మహిళలను పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

విజృంభించిన సైబర్ నేరగాళ్లు

బ్యాంకు ఖాతాల నుండి నగదు విత్‌డ్రా ఆందోళనలో బాధితులు

ప్రజాశక్తి మడకశిర

సైబర్ నేరగాళ్లు మడకశిర ప్రాంతంలోని బ్యాంకు ఖాతాదారులపై కన్నేశారు. వారి బ్యాంకు ఖాతా నుంచి పెద్ద మొత్తంలో నగదును దోచేసుకుంటున్నారు. ఈనెల 2వ తేదీ నుంచి ఈ దోపిడీ ప్రారంభమైంది. సైబర్ నేరగాళ్లు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని లక్షలాది రూపాయలను దోచుకుంటున్నారు. దీంతో ఈ ప్రాంతవాసుల్లో ఆందోళన మొదలైంది. మడకశిర పట్టణంలోని పలు బ్యాంకులలో ఖాతా కలిగిన లబ్ధిదారుల ఖాతా నుండి లక్షలాది రూపాయల నగదును సైబర్ నేరగాళ్లు రాత్రివేళల్లో చడీ చప్పుడు లేకుండా దోచుకుంటుండడంతో స్థానికులు ఆందోళన గురవుతున్నారు. ముఖ్యంగా మడకశిర పట్టణంలో ఉన్న భారతీయ స్టేట్ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, కర్నాటక బ్యాంకు, యూనియన్ బ్యాంకులో ఖాతా కలిగిన వారి ఖాతా నుండి నగదును ఖాతాదారులకు తెలియకుండా నాలుగైదు రోజుల నుంచి సైబర్ నేరగాళ్ల అదీ రాత్రి వేళల్లో వారి ఖాతాలలో నగదును ఉపసంహరించుకుంటున్నారు. ఈ మేరకు నగదు ఉపసంహరణ అయినట్లు బాధితుల ఎస్ఎంఎస్ ద్వారాసమాచారం వస్తోందని బాధితులు హనుమంతరాయప్ప, చిన్నప్ప తదితరులు లబోదిబో మంటున్నారు. తమ ప్రమేయం లేకుండా ఖాతాలో వున్న సొమ్ము బదిలీ అవుతుండటంతో దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. బాధితుడు హనుమంత రాయప్పకు బుధవారం రాత్రి ఆంధ్ర ప్రగతిగ్రామీణ బ్యాంకులో అతని ఖాతా నుంచి 5వేల రూపాయల నగదును ఉపసంహరించుకున్నట్లు ఫోన్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందింది. దీంతో హనుమంతరాయప్ప ఉదయం వెళ్లి బ్యాంకులో ఖాతా చూడగా అందులో కేవలం రెండు రూపాయలు మాత్రమే ఉండని బ్యాంక్ అధికారులు చెప్పారు. తన ప్రమేయం లేకుండా తన ఖాతా నుంచి నిధులు ఎలా విత్‌డ్రా అయ్యాయని బాధితుడు బ్యాంకు అధికారులను ప్రశ్నిస్తే తమకు ఫిర్యాదు రాసి ఇవ్వాలని ఈ విషయాన్ని సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇస్తామని చెబుతున్నారని బాధితుడు తెలిపాడు. అదే విధంగా మడకశిరకు సంబంధించిన భారతీయ స్టేట్ బ్యాంకు ఖాతా నుంచి గురువారం అర్ధరాత్రి దాదాపు 30వేల రూపాయల పైగా నగదు ఉపసంహరించుకున్నట్లు ఫోన్‌కు ఎస్ఎంఎస్ వచ్చింది. దీంతో బాధితుడు శుక్రవారం ఉదయం ఆ బ్యాంకుకు వెళ్లి అధికారులను సంప్రదించాడు. వారు ఖాతా పరిశీలించగా అందులో కేవలం రెండు రూపాయలు మాత్రమే బ్యాలెన్స్ చూపించడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. అలాగే కర్నాటక బ్యాంకులో చిన్నప్ప అనే ఖాతాదారుని ఖాతా నుంచి 30 వేలరూపాయల నగదును సైబర్ నేరగాళ్లు డ్రా చేసుకున్నట్లు తెలిసింది. అదే విధంగా శుక్రవారం రాత్రి మరికొంతమంది బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయమైంది. పట్టణానికి చెందిన గంగమ్మ అనే మహిళకు చెందిన భారతీయ స్టేట్ బ్యాంకు ఖాతా నుంచి 30 వేల రూపాయలు, యూనియన్ బ్యాంకు లో 9వేల రూపాయలు నగదు విత్‌డ్రా అయింది. అమరాపురం మండలం గునేహళ్లి గ్రామానికి చెందిన కాంతమ్మ అనే మహిళ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో రుణం తీసుకున్న 55వేలను ఖాతాలో ఉంచుకుంది. ఈమె ఖాతా నుంచి కూడా సైబర్ గాళ్లు నగదును మాయం చేశారు. అదేవిధంగా రోళ్ల మండలం వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ఓ ఉద్యోగి ఖాతా నుంచి 60 వేల రూపాయలు దోచుకున్నారు. మడకశిర మండలంలో ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడికి వేతనం ఖాతాలో పడటంతో ఆయన తీసుకున్న బ్యాంకు రుణం సొమ్మును బ్యాంకర్ల జమ చేసుకోగా మిగిలిన మొత్తాన్ని సైబర్‌నేరగాళ్లు మాయం చేశారు. మూడు రోజుల నుండి ఆయా బ్యాంకులలో దాదాపు 20 నుండి 30 మంది ఖాతాదారుల ఖాతాల నుంచి లక్షలాది రూపాయలను గుర్తు తెలియని వ్యక్తులు ఉపసంహరించుకుంటున్నారు. దీంతో బాధితులు బ్యాంకుల వైపు పరుగులు తీస్తున్నారు. బ్యాంకు అధికారులతో ఆరా తీస్తున్నారు. ఖాతాదారులు ఇంతకు ముందు ఎవరికి బ్యాంకు లావాదేవీలకు సంబంధించి క్యాష్ కలెక్షన్ పాయింట్, లేదా ఇతర చోట్ల వేలిముద్రలు వేసి ఉంటారని సైబర్‌నేరగాళ్లు ఆ వేలిముద్రల ఆధారంగా నగదును దోచుకుంటూ ఉండవచ్చునని ఓ బ్యాంకు అధికారి ప్రజాశక్తితో వ్యాఖ్యానించారు. బ్యాంకర్ల, పోలీసులు ఈ విషయంపై స్పందించి సైబర్ నేరగాళ్ల ఆట కట్టించి తమకు న్యాయం చేయాలని బాధితులు, బ్యాంకు ఖాతాదారులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

గుత్తి: పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుంతకల్లు మండలం పాత కొత్త చెరువు గ్రామానికి చెందిన సాయితేజ (21) తమ సమీప బంధువు యాడికి మండలం రామరాజుపల్లికి చెందిన శివరంగాతో కలిసి గుత్తి మండలంలోని బాట సుంకలమ్మ ఆలయం వద్ద జరిగిన దేవర ద్విచక్ర వాహనంలో వచ్చారు. భోజనం చేసిన అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా పట్టణ శివారులోని ఓ దాబా ఎదురుగా 44వ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సాయితేజ అక్కడికక్కడే మృతిచెందాడు. శివరంగా తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు క్షతగాత్రున్ని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా.. ఇద్దరికి గాయాలు

పుట్లూరు : మండలంలోని నారేపల్లి గ్రామంలో ఆదివారం ద్విచక్ర వాహనం బోల్తా పడటంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తుల వివరాల మేరకు.. యాడికి మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన రాజేష్, చంద్రమోహన్ నారేపల్లి మీదుగా స్వగ్రామానికి వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కింద పడ్డారు. గమనించిన స్థానికులు 108 ద్వారా తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తెగిపడిన 11 కెవి విద్యుత్ లైన్..తృటిలో తప్పిన ప్రమాదం

ఆత్మకూరు : మండలంలోని పి.సిద్దరాంపురం గ్రామ సమీపంలో 11 కెవి విద్యుత్ లైన్ ఆదివారం తెగిపడ్డాయి. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు. ఏదైనా జరగరానిది జరిగి ఉంటే ఏం చేస్తారమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ లైన్లు మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

పుట్టపర్తి రూరల్ : రాష్ట్రస్థాయి శాప్ లీగ్ షూటింగ్ బాల్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు షూటింట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు తెలిపారు._ మండల పరిధిలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో 18 ఏళ్ల లోపు బాలుర జిల్లా షూటింగ్ బాల్ జట్ల ఎంపికను పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం నిర్వహించారు. వివిధ మండలాల నుండి వచ్చిన క్రీడాకారుల నుంచి వారి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లా జట్లకు ఈనెల 14వ తేదీన విజయవాడలో రాష్ట్రస్థాయి శాప్ లీగ్ షూటింగ్ బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రుద్రాక్షి, జహీర్ ఖాన్, గౌతమ్ నాయక్, గణేష్ నాయక్, సతీష్, సాయి, ఈశ్వర్ ,పవన్, లతీఫ్, సాయి చరణ్ ,సుశాంత్ ,అశ్రీప్ జస్వంత్ బాలు కార్తిక్, రఘు ,మంజు తదితరులు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్ బాబు, పీడీ అజీమ్‌బాషా, సర్పంచి మల్లిరెడ్డి, విద్యాకమిటీ ఛైర్మన్ నరసింహారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొత్తచెరువు : మండల పరిధిలోని తలమర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. 1975 - 76లో పదవ తరగతి చదివిన విద్యార్థులు సమావేశమై యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమ గురువులు మాధవరెడ్డి, పుల్లప్ప, పోతిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సత్యనారాయణ రెడ్డి, రామచంద్ర, సునీత, విష్ణువర్ధన్ రెడ్డి, మల్లమ్మ, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కొత్తచెరువు : ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకురాలు మంజుల డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎపిటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంజుల మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న డిఎ బకాయిలు మెడికల్ బిల్లులు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఇంగ్లీష్ మీడియం కొనసాగించాలని రోజువారి పాఠశాల హాజరులో ఫేస్ యాప్ అప్లోడ్ ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోనంకి అశోక్ కుమార్, ముత్యాలప్ప, శ్రీనివాసులు, పివి మాధవతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

కొత్తచెరువు : మండల పరిధిలోని లోచర్ల గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో జనసేన పార్టీ కన్వీనర్ పూల శివప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు పూల కోనప్ప జ్ఞాపకార్థంతో కిమ్స్ సవేరా ఆస్పత్రి డాక్టర్లు గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు ఈ శిబిరంలో 150 మందికి చికిత్సలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సవేరా హాస్పిటల్ ఏరియా మేనేజర్ షేక్షావలి, డాక్టర్ రామ్ కుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

గుడిబండ : హిందూపురం, మడకశిర డిపోల నుంచి కర్నాటక రాష్ట్రం సిరా వరకు నడుస్తున్న బస్ సర్వీసులను పునరుద్ధరించాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బస్సు సర్వీసులను ప్రస్తుతం రద్దుచేసి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గతంలో హిందూపురం డిపో నుంచి మడకశిర మీదుగా గుడిబండ, రొళ్ల, మధుడి, రాయపురం మీదుగా బస్సు నడిచేదన్నారు. ఉన్నపలంగా అధికారులు ఈ బస్సు సర్వీసును రద్దు చేయడంతో ప్రయాణికులు, రైతులు, ముఖ్యంగా విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని వాపోయారు. అదేవిధంగా హిందూపురం డిపో నుంచి బాలేపల్లికి వెళ్లే బస్సు సర్వీసును కూడా నిలిపివేశారన్నారు. దీంతో ఆయా గ్రామాల విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు,. ఇదే కాకుండా హిందూపురం టు సిర, బస్సు సర్వీసును నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి రద్దు చేసిన బస్సు సర్వీసులను యథావిధిగా నడపాలని డిమాండ్ చేశారు.

పార్టీ వాలంటీర్ల నియామకానికి సమావేశాలు

రొద్దం : పెనుగొండ నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ వాలంటీర్ల నియామకంలో భాగంగా మండలానికి సంబందించిన వాలంటీర్ల నియాకమంపై మాజీ ఎమ్మెల్యే పార్థసారథి ఆధ్వర్యంలో పంచాయతీల వారీగా ఆదివారం సమావేశం నిర్వహించారు. కలిపి, చిన్నమంతూరు, చెరుకూరు, నల్లూరు పంచాయతీల వారితో సమావేశం నిర్వహించి పార్టీకోసం చురుకుంగా పనిచేసే వారిని వాలంటీర్లుగా నియమించడానికి పేర్లు ఇవ్వాలని గ్రామస్థాయి నాయకులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నరహరి, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాన్ని పునర్ నిర్మిస్తాం

బుక్కపట్నం : రోడ్డు విస్తరణలో భాగంగా కోల్పోయిన రామాలయ నిర్మాణాన్ని గ్రామస్తుల సహకారంతో తిరిగి నిర్మిస్తామనినిర్మాణ బాధ్యతలను కెంపరాజు రాజశేఖర్ గౌడ్ కు అప్పజెప్పామనిగ్రామస్తులు తెలిపారు. ఆదివారం రామాలయ గుడి నిర్మాణ సమావేశం నిర్వహించారు. గ్రామస్తులు, దాతల సహాయ సహకారాలతో గుడి నిర్మించాలని తీర్మానం చేసి ఆబాధ్యతను కెంపరాజు రాజశేఖర్ అనే వ్యక్తికి అప్పగించారు.

12న ముగ్గుల పోటీలు

పుట్టపర్తి అర్బన్ : సంక్రాంతి సంబరాలలో భాగంగా ఈ నెల 12న ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ముగ్గుల పోటీలలో పాల్గొన్న విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే పాల్గొనే మహిళలందరికీ కన్సలేషన్ బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తిగల పట్టణ మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పాల్గొనేవారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని మరిన్ని వివరాలకు ఉట్లు సోము 9704569811 కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

టిడిపిలో పలువురు చేరిక

తనకల్లు : మండలం దుగునేపల్లి గ్రామంలో పలువురు టిడిపిలోకి చేరారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఇమాం మౌజన్ల కలయిక సమావేశంలో మండలంలోని ఇమాం మౌజన్ అధ్యక్షులు అలీ ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో ఇమాం మౌజన్లు, ముతవల్లి సుబహాన్, ఇమాం కలిముల్లా, ఇమాం సనఉల్లాహ్, ముతవల్లి చిన్న హుస్సేన్, ఇమాం జి.హైదర్ వలి, ముతవల్లి ఖముషా, ఇమాం నాజర్, ముతవల్లి షాజహాన్, మౌజన్ రహంతుల్లాహ్, ఇమాం సమిఉల్లాహ్, ఇమాం ఖాసీం,ముతవల్లి అమీర్, ముతవల్లి బాబు, ఇమాం మాసుం తదితరులు పార్టీలో చేరారు. వీరందరికీ కందికుంట వెంకటప్రసాద్ టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ శంకర్ నాయుడు, నాయకులు కుంచె నాగేంద్రప్రసాద్, జియావుల్లా, దామోదర్, మహబూబ్ బాషా, శ్రీధర్ రెడ్డి, డైమండ్ ఇర్ఫాన్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలోకి చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్, తదితరులు

ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ

పెనుకొండ : పట్టణంలోని తోటగేరి నందు గల నగరేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు షిరిడీ సాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్పర్సన్ శిల్ప ఆదివారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా శిల్పకు నగరేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

పూజాకార్యక్రమాల్లో పాల్గొన్న శిల్ప, తదితరులు

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

రొద్దం : ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నాగస్వామి హెచ్చరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా తెల్లవారుజామున జరుగుతున్నాయని రైతులు తెల్లవారు జామున ఎద్దులబండ్లపై ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో బాగంగా ఆర్. మరవపల్లి సమీపంలో ఇసుక తరలిస్తున్న ఎద్దులబండిని అడ్డుకుని ఇసుక కిందకు వేయించి కౌన్సిలింగ్ ఇచ్చి వెనక్కు పంపించారు. అనంతరం మండలంలోని పెద్దమంతూరు, చెరుకూరు వద్ద ఎద్దులబండ్ల యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎవరికైనా ఇసుక కావాల్సిన వారు ఉదయం 8గంటల నుండి సాయంత్రం 6గంటల లోపు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో పోలీసులు మహేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లు ఆపాలి : సిపిఎం

పెనుకొండ : దుకాణదారుల నుంచి అక్రమ వసూలు ఆపాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని బాబయ్య స్వామి ఉరుసు సందర్భంగా అనేక రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి వ్యాపారాలు చేసుకుంటున్న దుకాణదారులతో నగర పంచాయతీ వారు అధికారికంగా దుకాణం విస్తీర్ణం ఆధారంగా నెలసరి అద్దె వసూలు చేశారని, వీటికి రసీదు కూడా ఇచ్చారని అన్నారు. ఇంతవరకు బాగుంది కానీ ప్రయివేటు వ్యక్తులు రోజు దుకాణదారులు దగ్గర అక్రమ దందా వసూలు చేస్తున్నారని విమర్శించారు. దుకాణదారులకు వ్యాపారం లేక చాలా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారిని బెదిరిస్తూ రోజువారి సుంకం వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పెనుకొండ సబ్ కలెక్టర్ స్పందించి దుకాణదారులకు న్యాయం చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రమేష్, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, సిఐటియు నాయకులు వజ్రం నాగప్ప, రెడ్డెప్ప రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

పిహెచ్‌సిని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆసుపత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని మూర్తి పల్లి సమీపన నూతనంగా నిర్మంచిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దా రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. గ్రామీణ ప్రాంతంలో గల ప్రతి సచివాలయం పరిధిలో హెల్త్ సెంటర్లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కేంద్రాల్లో క్వాలిఫైడ్ డాక్టర్లను ఏర్పాటు చేసి, సాధ్యమైనంతవరకు చిన్న చిన్న జబ్బులకు చికిత్స చేయడంతో పాటు, అవసరమైన వారికి రక్త పరీక్షలను కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రతి ఆరోగ్య కేంద్రానికి అత్యాధునికమైన వసతులతో కూడిన భవన నిర్మానాలు, వైద్యపరికరాలు, ఫర్నీచర్ అందుబాటులోకి తీసుకువచ్చి ప్రతి పేద వాడికి కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తామన్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణంలో ఒక మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పరికి నజీమున్నీసాసాదిక్, డాక్టర్ తేజ్ కుమార్, వైస్ ఛైర్మన్ కొమ్ము గంగాదేవి శంకర, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, కౌన్సిలర్లు గిరిజమ్మ, ఇస్మాయిల్, రాంప్రసాద్, ఖాసీం, మురళి, ప్రణీత్ రెడ్డి, ఆవుల స్వామి, మహమ్మద్, కృపాకర్ రెడ్డి తదితరులతో పాటు, వైద్యులు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెస్తలు రాజకీయంగా ఎదగాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

బెస్తలు రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా ఎదగాలని అందరూ ఐక్యంగా తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని బెస్త సంఘం జిల్లా అధ్యక్షులు బెస్త చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం పుట్టపర్తి సమీపంలోని కర్నాటక నాగేపల్లి వద్ద జిల్లా బెస్త నాయకుల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న చంద్రశేఖర్ మాట్లాడుతూ అనాదిగా బెస్తలను ఓటు బ్యాంకుగానే రాజకీయ పార్టీలు వినియోగించుకుంటున్నాయన్నారు. బెస్తలు ఐక్యతతోనే రాజ్యాధికారం సాధించవచ్చున్నారు. గ్రామస్థాయి నుంచి బెస్తలను చైతన్య పరుస్తూ సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఆఫ్ కాఫ్ ఛైర్మన్ గా బెస్తలను నియమించాలని, మత్స్య సహకార సంఘాలలో బెస్తలకే చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. వచ్చే మార్చి నాటికి కమిటీలు, సభ్యత్వం పూర్తి చేయాలని సమావేశంలో తీర్మాణించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జై సాయి, కార్యదర్శులుగా కేశవ, రవి గౌరవ అధ్యక్షులుగా బెస్త శివ, నారాయణప్ప, లక్ష్మీనారాయణను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షులు బయన్న, గౌరవ సలహాదారులు బెస్త చలపతి, సుధా రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు సత్య సాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు.

రత్నాకర్‌ను కలిసిన బెస్తసంఘం నాయకులు

ముగిసిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

పరిగి : మండలంలోని కొడిగెనహళ్లి ఎపిఆర్ఎస్ ఎక్స్‌లెన్స్ క్రీడా మైదానంలో జరుగుతున్న మండలస్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. మండల వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతగా శ్రీరంగరాజుపల్లి జట్టు నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో 16 జట్లు పాల్గొనగా ఫైనల్‌లో శ్రీరంగరాజుపల్లి, పెద్దిరెడ్డిపల్లి జట్లు పోటీపడ్డాయి. విజేతగా నిలిచిన జట్టుకు రూ.3016, రెండోస్థానంలో నిలిచిన జట్టుకు రూ. 2016ల నగదును రిటైర్డ్ పీడీ బ్రహ్మయ్య చేతుల మీదుగా అందజేశారు. టోర్నమెంట్లో పాల్గొన్న జట్లకు దివ్య ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పరిగి వేణుగోపాలరావు భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శరీర దారుఢ్యానికి బాగా తోడ్పడుతాయని ఇటు మానసికంగా ఎదుగుదలకు ఉపకరిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మురళీధర్ బాబు, పీడీలు రామాంజనేయులు, మహేష్, దీపక్, మూర్తి, నిర్వాహకులు కార్తీక్, వేణు, హరి తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు బహుమతి ఇస్తున్న దృశ్యం

పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం అభినందనీయం

ప్రజాశక్తి - హిందూపురం

ప్రతిభా వంతులైన విద్యార్థులను ఎంపిక చేసి వారికి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప అన్నారు. ఆదివారం స్థానిక ఎంజిఎం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు అభయ-నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపిక పరీక్షా నిర్వహించారు. ఈ పరీక్షకు పట్టణంలో వివిధ పాఠశాలలకు చెందిన 423 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 247 మంది విద్యార్థులు హాజరైనారు. ఈ పరీక్షా పత్రాలను ఎంఇఒ గంగప్ప, ఎంజిఎం పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం, ఫౌండర్ సిద్దగిరి శ్రీనివాసులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పరీక్షాల్లో ఉత్తర్ణీత సాధించిన వారికి 10వ తరగతి అనంతరం జరిగే ఎపిఆర్‌జెసి, పాలిటెక్నిక్, ఇతర ప్రవేశ పరీక్షాలతో పాటు పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓరియంటల్ స్కూల్ హెచ్ఎం పెన్నోబులం, ఫౌండేషన్ ప్రతినిధులు రాజశేఖర్ రెడ్డి, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

వైసిపి పాలనకు చివరి రోజులు : టిడిపి

మడకశిర : రాష్ట్రంలో వైసిపి పాలన వచ్చినప్పటినుండి ఇసుక కూడా బంగారమైందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు , మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఎద్దేవా చేశారు. ఆదివారం మండల పరిధిలోని ఆర్ అనంతపురం , రేకులకుంట తదితర గ్రామాలలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర సరుకుల ధరలను అదుపు చేయలేని స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందన్నారు. సంక్షేమ పథకాల పేరు చెప్పి దోపిడీ చేయడం తప్ప చేసిన అభివృద్ధి ఏమీలేదని విమర్శించారు. వైసిపి పాలనకు రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షులు మనోహర్, రిటైర్డ్ ద్యోగి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు .

సమావేశంలో పాల్గొన్న గుండుమల, తదితరులు

గుడిబండ కొండలో పులులు. ఎలుగుబంట్ల సంచారం

భయాందోళనలో పరిసర గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి గుడిబండ

గుడిబండ కొండ సరిహద్దులో చిరుతపులులు, ఎలుగుబంట్లు విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గుడిబండ కొండ దాదాపు 90 ఎకరాల విస్తీర్ణంలో ఉంది.ఆ కొండలో పెద్దపెద్ద గుహలు, చెట్లు విపరీతంగా పెరిగి దట్టమైన అడవులుగా ఏర్పడడంతో ఈ కొండలో జంతువులు స్థావరాలు ఏర్పరచుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆహారం కోసం సమీపంలోని తోటల్లోకి చొరబడుతుంటాయి. వీటిని చూసిన మహిళలు, పిల్లలు, పెద్దలు భయాందోళనకు గురవుతున్నారు. ఏ సమయంలో ఏం జరుగుతుందో అని ఆందోళనకు గురవుతున్నారు. సాయంత్రం ఐదు, ఆరు గంటలకే ఎలుగుబంట్లు గ్రామాల్లో చొరబడుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాలం వెల్లదీస్తున్నారు. ఇంతజరుగుతున్నా సంబంధిత ఫారెస్ట్ అధికారులు మాత్రం నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. మండల పరిధిలోని కరికెర, హిరేతుర్పి, కెఎన్. పల్లి, చిగతుర్పి, దాసరపల్లి తదితర గ్రామాల్లో సాయంత్రం 6 గంటలకే ఎలుగుబంట్లు గ్రామాల్లో చొరబడి హాల్‌చల్ చేస్తున్నాయి. ఇదిలా ఉండగా చిరుతపులులు సాయంత్రం సమయంలో కొండపైన దర్శనమిస్తూ ఉదయం పూట దాహం తీర్చుకోవడానికి కొండపక్కల ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న నీటి తొట్టెల వద్దకు వస్తున్నాయి. ఈ విషయమై సంబంధిత ఫారెస్ట్ అధికారులకు గ్రామస్తులు ఎన్నిసార్లు విన్నవించుకున్న వారు తూతూ మంత్రంగా పర్యవేక్షణ చేస్తూ అవి మిమ్మల్ని ఏమి చేయలేవని ఉత్తుత్తి సలహాలు ఇస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఒకపక్క చిరుతపులులు, మరో పక్క ఎలుగుబంట్లు .విచ్చలవిడిగా గ్రామంలో చొరబడి ప్రజల్ని భయాందోళనకు గురిచేస్తున్నాయని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.